# తోడుదొంగలు

ఆనోటా ఆనోటా పడి తెల్లవారేసరికే ఆవార్త ఊరంతా పాకిపోయింది. "రామదాసు పోయాడుట, పాపం రామదాసు చచ్చిపోయాడుట" అనే మాటలు అన్నివైపుల నుంచీ ఒక్కసారిగా వినిపించినయ్. ఎవరిమటుకు వారు ఈవార్త అబద్ధమేమోనని అనుమానపడుతునే ఆపుకోలేక ఇంకోళ్ళకి చెబుతున్నారు. ఈవార్త నమ్మటానికి వీలులేకుండా వుంది. నమ్మకుండా వూరుకోటానికి అంతకంటె వీలులేకుండా వుంది. అందరికీ ఈవార్త అబద్ధమైతే బాగుండు ననిపిస్తోంది. కాని ఇటువంటి అబద్ధం ఎవరైనా ఎందుకు కలిపిస్తారు? అందులో అందరికీ తలలో నాలుకగా వుండే రామదాసుమీద ఇటువంటి పాడు అబద్ధం ఎవరు కల్పిస్తారు? చాలాసేపు తటపటాయించి సిద్ధాంతరాద్ధాంతాలు చేసి చివరికి ఎల్లాగైతేనేం అంతా రామదాసుమరణవార్తని చేదుమాత్రలాగా మింగారు. అతని కోసం అంతా రకరకాలుగా విచారపడటం సాగించారు.

మరణవార్త నిజమని నమ్మగానే అందరికీ రామదాసు ఎల్లాచచ్చిపోయాడో, ఏపరిస్థితుల్లో చచ్చిపోయాడో తెలుసుకోవాలనేకోరిక ఎక్కువైపోయింది. అప్పటికప్పుడే చాలా మంది బుద్ధిమంతుల బుర్రలు చురుకుగా పనిచెయ్యటం మొదలుపెట్టినై. ఆత్మహత్య చేసుకునివుంటాడని కొందరు వూహించారు. అతను అటువంటి పిరికిపంద కాడు. ఆపని

ఎప్పుడూ చెయ్యడని కొందరు ఖండించారు. ఎక్కడో ఎవరో చంపేసి వుంటారని కొందరు ఊహాగానం చేశారు. ఎక్కడైనా దొంగచాటుగా సారాదొరికితే ఇన్నాళ్ళ విలువా ఒక్కనాడే చెల్లించి వుంటాడనీ, తాగుడువల్లే ప్రాణం పోయివుంటుందనీ కొందరు అన్నారు. రకరకాల ఊహాలు గాలిలో తేలిపోతు న్నయ్. ఏమయితేనేం, ఎల్లాపోతేనేం, రామదాసు ఇక లేడనే నిష్ఠురసత్యం అందరి ముందూ నగ్నంగా నిలబడి అందరి కళ్లనీ తడిపి వేయసాగింది.

ఇంతలో రామదాసుఆంతరంగిక మిత్రుడు భీమారావు పొరుగూరువెళ్ళి అప్పుడే ఊళ్ళోకి వచ్చాడనే కబురు తెలిసి అంతా అతని దగ్గరకి పరిగెత్తి అతన్ని చుట్టుముట్టారు. నిజ మేనా అని నిలవేసి అంతాగుచ్చి గుచ్చి అడిగారు. వీరిసందే హాలకి బిత్తరపోయి భీమారావు చివరకి అందరికీ విశ్వస నీయంగా వుండే ఈ విచిత్రఘటనని పూస గుచ్చినట్లు కళ్ళకి కట్టేట్లు చెప్పటం మొదలుపెట్టాడు. టూకీగా చెప్పాలంటే— అతనూ రామదాసూ కలిసి కృష్ణానదిలో ఉపద్రవంగా వచ్చిన వరదలని చూద్దామని వెళ్ళారు. ఒడ్డున నిలబడి చూస్తుంటే వరదలోపడి ఒక గుడిసె కొట్టుకువస్తూ కనిపించింది. ఆ గుడిసె నడికొప్పుమీద ఒక అయిదేళ్ళకుర్రాడు జాలిగా ఏడుస్తూ కొట్టుకొస్తున్నాడు. చూసీ చూడగానే ముందు వెనక లాలో చించకుండా రామదాసు అమాంతంగా నదిలోకి ఒక్క దూకు దూకాడు. చూస్తూవుండగానే పరవళ్లు తొక్కుతున్న ఆప్రవా హంలో పడి కంటికి కనిపించకుండా కొట్టుకుపోయాడు. ఒడ్డు

నున్న జనమంతా ఈవిషాదాన్ని చూడలేక గుండెలు బాదు కున్నారు. ఇదీ కథ.

వినగానే "అయ్యో పాపం! ఎల్లాంటివాడికి ఎల్లాంటిచావు! ఎంత మొండిసాహసం!" అని ఒక ముసలాయన కళ్ళు తుడుచు కున్నాడు.

"-సలామనిషి తీరే అంత. అడ్డగోలు మనిషి. తనకి ఎంత తోస్తే అంతా ఆ నిమిషంలో చేస్తేనే కాని నిద్రపట్టదు" అని మరొక పడుచాయన వ్యాఖ్యానం చేశాడు.

"సరేకాని ఇప్పుడు మనం ఏం చెయ్యాలి? ఇకముందు సంగతేమిటి?" అనే ప్రశ్న బయలుదేరి అందరినీ కలవరపరు స్తోంది. తలొకరికీ తలొక ఆలోచనా తట్టుతోంది.

దీనికి సమాధానంగా "చేసేదేముంది? ఏం చేసినా పోయినవాడు తిరిగిరాడు కదా?" అని ఒక మెట్టవేదాంతి అన్నాడు.

"ఆమాత్రం మాకూ తెలుసోయ్, ఏమీ చెయ్యటం ఇష్టం లేకపోతే తమ రిక్కడినుంచి దయచెయ్యొచ్చు" అని ఒక విద్యార్థి దుడుకుగా బదులు చెప్పాడు.

ఈవార్త వినగానే అక్కడికి విద్యార్థులు గుంపులు గుంపులుగా ముసురుకున్నారు. ఆ గుంపులోంచి ఒకవిద్యార్థి "ఇక్కడే మన మొకస్మారకసభ జరిపి రామదాసుఆత్మకి శాంతి కలగాలని తీర్మానం చేద్దాం." అని ఒక విద్యార్థి సూచింగానే అంతా అంగీకరించారు.

ఇంతలో అక్కడికి గుండెలు బాదుకుంటూ కిల్లీకొట్టు పుల్లయ్యా కిరానాకొట్టుమల్లయ్యా పరుగుపరుగున వచ్చారు

"నిజమేనా బాబూ? పిడుగులాంటి కబురువిన్నాం. ఇవాళ ఎవరి మొహం చూసి లేచామో? మా రామదాసు చచ్చిపోయాడట నిజమేనా?" అంటూ ఎంతో ఆదుర్దాగా అడిగారు. అక్కడ గుమికూడిన జనం కేసి చూసేసరికి వారి సందేహం ఎగిరిపోయింది. కుప్పన కూలబడిపోయారు.

ఈ కబురు విని వినటంతోటే నేలకి కఱ్ఱ పొడుచుకుంటూ ఒక మూడుకాళ్ళ ముసలమ్మ దడదడలాడుతూ వచ్చి కబురు నిజమని తెలియగానే నిలువునా నీరైపోయి చతికిలబడింది. "పండులాటివాడికి రాకపోతే నాలాటి పాపిష్ఠిముండకు రాకూడదూ చావు? అయ్యో నాకింకెవరు ఉత్తరాలు రాసి పెడతారు. దూరదేశాలనుంచి అబ్బాయిరాసిన ఉత్తరాలు ఇంక నాకెవరు చదివి వినిపిస్తారు?" అని ఒక్క శోకం పెట్టేసరికి అందరి కళ్ళలోనూ నీళ్ళు గిఱ్ఱున తిరిగినై.

ఇందాకటినుంచీ దిగాలుపడి కూచున్న కిల్లీకొట్టుపుల్లయ్య మూర్ఛనుంచి తేరుకున్న వాడిలాగా "అల్లాటి మనిషి మళ్ళీ కనిపిస్తాడా? స్నేహానికి ప్రాణం ఇచ్చేవాడు. కొట్టుమీద కాసేపు కూచుంటేచాలు, నవ్వులతో కడుపుబ్బిపోయేది. అంత సరదా మనిషిని ఇక చూడలేం" అని నిట్టూర్పు విడిచాడు.

"అవునవును. ఈ కలిలో ఇక అల్లాటి మనిషిని చూడటంకల్ల. ఇంక నాకు బేరం ఏం సాగుతుంది? నెలాఖరు వచ్చేసరికి లెక్కలన్నీ చూసి పెట్టేవాడు. తలలో నాలుకలాగా వుండేవాడు. ఎప్పుడూ కానీకావాలని అడిగిన పాపానపోలేదు. ఎల్లాకాలం వెళ్ళదీసేవాడో ఎవరికీ తెలిసేదికాదు. అతని ఋణం ఎల్లా తీర్చుకోగలం?" అని కిరాణాకొట్టు మల్లయ్య తన

ఆక్రోశం వెళ్ళబోశాడు. ఇది విని పక్కనే నిలుచున్న ఘరానా పెద్దమనిషి ఒకాయన "ఇదుగో నీ ఋణం తీర్చుకునేటందుకు నేనొక ఉపాయం చెబుతున్నాను. రామదాసు విగ్రహం ఒకటి తయారుచేయించి బజార్లో అందరికీ కనిపించే చోట పెట్టించు" అన్నాడు. "ఓ దాని కేం భాగ్యం?" తప్పకుండా చేస్తాను అని మల్లయ్య అనగానే అంతా సంతోషంగా చప్పట్లు కొట్టారు.

ఇంతలో ఉద్రేకంతో ఒక విద్యార్థి లేచినిలబడి "రామదాసు అసలు మావాడు. అతను విద్యార్థుల్లో విద్యార్థి. మాతో రాజకీయాలని గురించీ సినిమాలని గురించీ గంటల కొద్దీ చర్చలు జరిపేవాడు. ఏవేవో కబుర్లుచెప్పి నవ్వించేవాడు. బతిమాలితే మాతోనే భోజనంచేసి మా గదుల్లోనే నిద్ర పోయేవాడు. తను అతను మాకందరికీ ఆప్తబంధువు, ప్రాణ మిత్రుడు. ఆయన మరణం మాకు తీరని నష్టం. అతనులేక పోతే మా హాస్టలుకి కళాకాంతులే లేవు" అని కంపించే గొంతుకతో చిన్న ఉపన్యాసం ఇచ్చాడు.

"కాదు కాదు రామదాసు మావాడు. నిజంగా మా వాడు" అని కిల్లికొట్టు మల్లయ్య బిగ్గరగా కేక వేశాడు.

"కాదు, కాదు, ఎవరివాడూ కాడు. రామదాసు నిజంగా మావాడు. ముమ్మాటికి మావాడు పార్కుదగ్గిర చెట్టుకింద నిలబడి తాజావార్తలు చెబుతూ తర్జనభర్జనలు చేస్తుంటే దారిన పోయేవాళ్ళంతా గుంపులు కూడేవాళ్లు. అతను లేకపోతే ఇక ఆ పార్కుముఖం ఎవరు చూస్తారు?

దాని దశ అతనితో ఆఖరు" అని ఇంకో నడికారు మనిషి నిశ్వాసం విడిచాడు."

ఇంతలో అక్కడికి "పేపర్ పేపర్" అని అరుచుకుంటూ ఒక కుర్రాడు వచ్చాడు. ఆ పేపర్లోకూడా రామదాసు మరణ వార్త ప్రకటితమయింది. ఫోటోకూడా పడింది. దానికింద అతని ప్రాణస్నేహితుడు భీమారావు కన్నీటి కానుకగా సమర్పించిన పద్యంకూడా అచ్చువేశారు. శంఖున పోస్తేగాని తీర్థం కాదు. పత్రికలో పడితేకాని సత్యంకాదు. ఇక రామదాసు లేడని అంతా రూఢి చేసుకున్నారు.

ఇందాకటినుంచీ దిగాలుపడి కూచున్న భీమారావు లేచి నిలుచుని గద్గదస్వరంతో "రామదాసు మీవాడా మావాడా అని మనసులో మనం వివాదపడి లాభంలేదు. అతను మనకందరికీ కావలసినవాడు" అనేసరికీ "సెబాస్ నిజం, నిజం" అని కిరానాకొట్టు మల్లయ్య మెచ్చుకున్నాడు.

ఒక విద్యార్థి లేచి "భీమారావుగారూ, మీరు మన రామదాసుని గురించి ఏమైనా మాట్లాడితే విందామని మేమంతా తహతహలాడుతున్నాం" అన్నాడు.

భీమారావు ఇల్లాఅందుకున్నాడు. "రామదాసునిగురించి మీకు తెలియందేముంది ? మీలాగే అతనుకూడా చదువు కోసం మొదట ఈవూరు వచ్చాడు. చాలా తెలివైనవాడు. చాలా అందంగా వుండేవాడు. చాలా బాగా చదివేవాడు. తల్లిదండ్రులు అతనిమీద కొండంత ఆశపెట్టుకున్నారు. అప్పుడు క్లాసులో మాధురి అనేఒక అందమైన అమ్మాయి చదువుతుండేది. ఆ అమ్మాయిని ప్రేమించి ఒక దేవతగా

ఆరాధించటం, తన ప్రేమని కావ్యాలలో చిత్రించి ఆమెకు అంకితం చేయటం అందరం రామదాసుని ప్రేమదాసని ఎగతాళి చెయ్యడం జరిగింది. ఈ ప్రేమ గొడవలో చదువు సున్నా చుట్టింది. ఇంటిదగ్గిర తల్లిదండ్రుల ఆశలన్నీ కొండ కెక్కేనయ్. ఇల్లా వుండగా ఒకరోజున అకస్మాత్తుగా మా క్లాసులోనే చదువుతున్న ఇంకో ధనవంతుడికీ మాధురికీ వివాహం జరిగింది. అప్పటినించీ రామదాసుపూర్తిగా మారిపోయాడు."

"అయితే మన రామదాసు భగ్నహృదయుడన్నమాట! కాని తన లోపలి దుఃఖాన్ని చిరునవ్వులో దాచుకునేవాడు" అని వ్యాఖ్యానించా డొక విద్యార్థి.

"అంతేకాదు రామదాసు గొప్ప ప్రేమయోగి. తన ప్రేమని ధ్వంసంచేసి జీవితాన్ని నాశనంచేసిన మాధురినే హృదయమందిరంలో భద్రంగా ప్రతిష్ఠించి నిత్యమూ ఆరాధించేవాడు. నిజంగా అతను ప్రేమయోగి" అని భీమారావు అనేసరికి గుంపులో ఒక మూలనుంచి "తాగుబోతు," ఇంకో మూలనుంచి "జూదరి", మరొకమూలనుంచి "పనికిమాలిన వాడు" అని గుసగుసలు వినిపించినయ్.

"అయితేనేం? అల్లాటి మనిషి ఎక్కడ దొరుకుతాడు? అటువంటి జాలిగుండె ఎవరికుంది? అతను తాగుబోతుకాదు. మాధురిని పొందలేని దుఃఖాన్ని మద్యంవల్ల మరిచిపోయే వాడు" అని భీమారావు కూచున్నాడు. అంతా అల్లాటి మనిషిని ఇకచూడటం కల్ల అని ఒప్పుకున్నారు.

"ఏమండోయ్ మల్లయ్య శెట్టిగారూ, తమరు ఇచ్చినమాట చెల్లించాలి. మన రామదాసు రూపం శాశ్వతంగా మన కళ్ళ

ఎదట వుండేట్లు విగ్రహం తయారు చేయించాలి." అని కిరానా మల్లయ్యగారిని ఘరానా పెద్దమనిషి హెచ్చరించాడు.

"తప్పక చేస్తాను. మీరు ఇన్నిసార్లు చెప్పాలా ?" అన్నాడు మల్లయ్య. మెల్లిగా మెల్లిగా ఒకళ్ళతర్వాత ఒకళ్ళు ఇళ్ళకి జారుకున్నారు.

ఆరోజు రాత్రే మాధురి భర్త పేపర్లో రామదాసు మరణవార్త చదివి భార్యకి వినిపించాడు. పేపర్లోపడిన ఫోటో కేసిచూచి మాధురి "పాపం పోయాడా ?" అందిజాలిగా. "పోయాడు, పిచ్చిపేమదాసు. వరదలో కొట్టుకుపోయాడు. పీడ విరగడయింది" అన్నాడు భర్త.

రామదాసు మరణం కలిగించిన విచారం క్రమేపి తగ్గి పోతోంది. అతను లేకపోయినా ఆ వూరిజీవితం ఎప్పటిలాగా సాగిపోతూనేవుంది. లాడ్జిలో కుర్రాళ్ళ సినిమాచర్చలూ, పార్కు దగ్గర పనిలేని పెద్దమనుషుల రాజకీయ వివాదాలు మామూలుగా జరుగుతూనేవున్నయ్, పుల్లయ్యకీ, మల్లయ్యకీ బేరంజోరుగా సాగుతూనేవుంది. అతనికోసం ఆవూరి జీవిత నాటకం స్తంభించిపోలేదు.

ఇల్లావుండగా ఒకరోజుపొద్దునరామదాసుఅమాంతంగా ఎక్కణ్నుంచో ఊడిపడి మల్లయ్య కిరానా కొట్టు ముంనుకి వచ్చి నిలబడ్డాడు. చూసీచూడంగానే మల్లయ్య వొళ్ళు ఝల్లుమంది. కళ్ళుతిరిగిపోయినై. ఏం భయంలేదులేవోయ్. నేను భూతాన్ని కాను. మనిషినే" అంటూబల్లమీదకూచుని రామదాసు సిగిరెట్ వెలిగించాడు. మల్లయ్య గబగబా దగ్గిరికివచ్చి "ఓరినీ ! ఎంతపనిచేశావ్. భలేవాడివే" అంటూ

రామదాసుని కౌగలించుకున్నాడు. "ఏంలేదు. విగ్రహం చేయించేఖర్చు నీకు తప్పిద్దామని మళ్ళీవచ్చానోయ్" అన్నాడు రామదాసు చిరునవ్వుతో

అప్పటికే జనం గుంపులుకూడి రామదాసునిచూసి ఆశ్చర్యంతో స్తంభించిపోతున్నారు. ఇదిచూసిన కిల్లీకొట్టు పుల్లయ్య సంతోషానికి పట్ట పగ్గాలులేవు. అయితే నువ్వసలు ఎక్కడికి వెళ్ళావ్ ? ఈ వార్తఎందుకు పుట్టింది ? నిజం చెప్పూ ?" అని నిగ్గదీశాడు. ఆ ప్రశ్నలన్నింటినీ తన తొణుకూ బెణుకూలేని చిరునవ్వుతో ఎదుర్కొని "అరే బ్రదర్, ఖంగా రేముందిరా ? నేను నిజంగా చచ్చిపోయినప్పుడు నన్నుగురించి మీరు ఏమనుకుంటారో తెలుసుకోవాలని అబద్దంగా చచ్చి పోయాను !" అన్నాడు.

"అయితే ఇన్నాళ్లూ ఎక్కడున్నావు !"

"అండర్ గ్రవుండులో వున్నానురా బ్రదర్"

"సంతోషించాం కాని మేం ఏమనుకున్నామో నీ కిప్పుడెల్లా తెలిసింది ? నువ్విక్కడ లేవుగా ?"

"లేకపోతేనేం ? మన భీముడున్నాడుగా ఇక్కడ ! అన్నాడు రామదాసు.

"అయితే ఇద్దరూ కలిసి ఆడిన నాటకమన్నమాట ! తోడుదొంగలు ?" అన్నాడు పుల్లయ్య.

"అవును నేను అసలు మొదటినుంచీ అబద్ధమనే అను కుంటున్నాను, నే నసలు నమ్మనేలేదు" అన్నాడు మల్లయ్య.

"అవునుపాపం. అందుకే కాబోలు, విగ్రహం చేయి స్తానని కూడా ఒప్పుకున్నావ్ ?" అంటూ రామదాసు చల్లగా లేచి కాలేజి కుర్రాళ్ళ లాడ్జికి బయలుదేరాడు.